మత్స్యకారులు, యువకులు చేపల వేటకు వెళ్లొద్దు

కామారెడ్డి, సెప్టెంబర్ 2 : మత్స్యకారులు, యువకులు చెరువుల్లో చేపల వేటకు వెళ్లొద్దని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడ రహదారులు దెబ్బతిన్నాయని తెలిపారు. లోలెవల్ వంతెనలు, కాజ్‌వేను అధికారులు పరిశీలించాలని పేర్కొన్నారు. వంతెనలపై నుంచి వాహనదారులు ప్రయాణించకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రధాన రహదారుల తోపాటు గ్రామాల్లోని రోడ్లపై కూడా నిఘా ఉంచాలని వెల్లడించారు. రైతులు పొలాల వైపు, పశువుల కాపర్లు కూడా పశువులను తీసుకొని బయటికి రావొద్దని సూచించారు. కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని ముట్టుకోవద్దని తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాప్రతినిధులు, నాయకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, సెప్టెంబర్ 2 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. అధికారులతో సోమవారం సమీక్షించారు. రోడ్లపై నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని, లేదంటే దోమలు వృద్ధి చెంది జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. పాత ఇండ్లలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వర్షాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎంపీవో, ఎంపీడీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడూ పరిశీలించాలని చెప్పారు.
బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కౌన్సిలర్లు, నాయకులు సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు హకీం, రఫీక్, ఎజాస్, రాజు, బాబా, శివ ఉన్నారు.

యాంటీబయాటిక్స్ ఇవ్వొద్దు

మాచారెడ్డి, సెప్టెంబర్ 2 : ఆర్ఎంపీ, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, యాంటీబయాటిక్స్, ఇంజక్షన్లు ఇవ్వొద్దని మాచారెడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదర్శ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశాపు హాల్‌లో ఆయాగ్రామాలకు చెందిన పీఎంపీ, ఆర్ఎంపీలతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్పిటల్ అని బోర్డు పెట్టొద్దని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్‌రావు, ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి ఆదర్శ్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు
- పలు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్

భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

బాన్సువాడ/కామారెడ్డి/మాచారెడ్డి/భిక్కనూరు, సెప్టెంబర్ 2 : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని, చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచాలని ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. కామారెడ్డి, టేక్రియాల్, లింగాపూర్ చెరువు, హౌసింగ్ బోర్డు కాలనీలోని ముంపు ప్రాంతాలు, జాతీయ రహదారిపై కుంగిపోయిన రోడ్లను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద, ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని సూచించారు. బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన రహదారి వెంట పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని సూచించారు. వార్డుల్లో ప్రజలకు అసౌకర్యాలు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గంగాధర్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, డాక్టర్ అంజిరెడ్డి, ఎజాస్, బాబా, ఉదయ్‌గుప్తా , కౌన్సిలర్లు లింగమేశ్వర్, వెంకటేశ్, కిరణ్‌కుమార్, నర్సుగొండ తదితరులు ఉన్నారు. జిల్లాలో వర్షానికి తెబ్బతిన్న భిక్కనూరు మండలం నుంచి కామారెడ్డి వరకు ఉన్న నాలుగు వరుసల జాతీయ రహదారిని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వర్షాలకు జాతీయ రహదారి దెబ్బతి, గుంతలు పడ్డ ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పాల్వంచలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. వసతిగృహంలోని హాల్, కిచెన్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం చుట్టూ చేరిన నీటిని తొలగించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఎస్‌సీడీవో రజిత, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్‌రెడ్డి, ఎంపీడీవో గోపీబాబు ఉన్నారు.

వరద తగ్గేవరకు కాజ్‌వే ను మూసివేయాలి

భవానీపేట-పోతారం గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేను వరద తగ్గేవరకు మూసివేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భవానీపేట గ్రామాన్ని సోమవారం సందర్శించారు. అకాల వర్షాల కారణంగా కాజ్‌వేపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాజ్‌వేకు ఇరువైపులా బారీకేడ్లను ఏర్పాటు చేసి పోలీస్ బందోబస్తు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జయంత్‌రెడ్డిని ఆదేశించారు. భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలోని ముంపునకు గురైన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు, ప్రైమరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులతో కలిసి పరిశీలించారు. పునరావాస కేంద్రంలో బాధితులకు ఆహారం తదితర ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలించి, చెరువు నీరు ఇండ్ల వరకు రావడానికి గల కారణాలను ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో రంగనాథరావు, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్, డీపీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రవికిరణ్, ఎస్సై సాయికుమార్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

కుంగిపోయిన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

బాన్సువాడలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బీసీ బాలుర వసతి గృహ సందర్శన

బీర్కూర్‌లోని బీసీ బాలుర వసతి గృహ పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 2 : బీర్కూర్‌లోని బీసీ బాలుర వసతి గృహాన్ని సబ్ కలెక్టర్ కిరణ్మయి సోమవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, వంటశాలను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ లత, మాజీ ఎంపీపీ రఘు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నేడు లింగంపేటలో వైద్య శిబిరం

లింగంపేట, సెప్టెంబర్ 2: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. నేత్ర సంబంధిత వ్యాధులు, నరాల బలహీనత, మెదడు, వినికిడి సమస్యలు, జీర్ణాశయ, శ్వాసకోశ సమస్యలపై చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 2 : మండలంలోని బొప్పాస్‌పల్లి తండా గ్రామానికి చెందిన చవాన్ కిమ్యా(68) శనివారం పశువులను మేపడానికి వెళ్లిన సమయంలో పిడుగు పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్సకోసం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందినట్లు చెప్పారు.

మొబైల్ ఫోన్లు అందజేత

మాచారెడ్డి/లింగంపేట, సెప్టెంబర్ 2 : సదాశివనగర్ మండలంలోని భూంపల్లికి చెందిన జోగు పాల్ దినాకర్, సోమార్‌పేటకు చెందిన బొడ్డు శంకరయ్య ఇటీవల ఫోన్లు పోగొట్టుకున్నారు. మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి మొబైల్ ఫోన్లను బాధితులకు పోలీస్ స్టేషన్‌లో సోమవారం అందజేశారు.
లింగంపేట మండల కేంద్రానికి చెందిన గుజ్జరి వాసర్ గత నెల 16న తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు.
దీంతో అతడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు వాసర్‌కు సోమవారం సెల్‌ఫోన్ అందజేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మాచారెడ్డిలో బాధితుడికి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై అనిల్

జిల్లా స్థాయి ఖోఖో టోర్నీ వాయిదా

కామారెడ్డి, సెప్టెంబర్ 2 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాయ్స్, గర్ల్స్ ఖోఖో పోటీలను ఈనెల 4వ తేదీన నిర్వహించనుండగా వర్షం కారణంగా ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసినట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో జనరల్ సెక్రటరీ అతిఖుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఒరిజినల్ ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు 6వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి నాగేశ్వర్‌రావు 8555996271,7396541233,9676269988 నంబర్లకు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.

ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈఈగా విజయ సారథి

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 2 : ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈఈ గా విజయ సారథి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈఈగా పనిచేసిన గణేశ్ గత నెలలో ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఆదిలాబాద్ జిల్లాలో ఏడీఈగా పనిచేసిన విజయసారథి ప్రమోషన్‌పై ఎల్లారెడ్డికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన విజయ సారథిని స్థానిక అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.

నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా శ్రీనివాస్

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్2 : నాగిరెడ్డిపేట తహసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ తొమ్మిది నెలల పాటు పని చేసి అవినీతికి పాల్పడుతున్న కారణంగా లక్ష్మణ్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. దీంతో ఆయన స్థానంలో ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు.

వసతి గృహ ఆవరణలోకి వర్షపు నీరు

ఎల్లారెడ్డిలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో నిలిచిన వర్షపు నీరు

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 2: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహం ఆవరణ ఆదివారం రాత్రి పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో వసతిగృహం వార్డెన్ శారద సమస్యను మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, నాయకుడు నునుగొండ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి, మున్సిపల్ సిబ్బందితో నీటిని తొలగింపజేశారు. వారికి వసతిగృహం సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్‌కు ఘన నివాళి

బాన్సువాడలో వైఆస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ/నస్రుల్లాబాద్/మాచారెడ్డి/కామారెడ్డి/లింగంపేట/మద్నూర్, సెప్టెంబర్ 2 : బాన్సువాడలోని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి స్వగృహంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పోచారం పూలమాలవేసి నివాళులర్పించారు. కామారెడ్డి, నస్రుల్లాబాద్, బీర్కూర్, మాచారెడ్డి, లింగంపేట మండలంలోని పోల్కంపేట, మద్నూర్ మండల కేంద్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వర్షం.. నష్టం

- తెగిపోయిన రోడ్లు.. ధ్వంసమైన కల్వర్టులు
- నిలిచిపోయిన రాకపోకలు
- పలు మండలాల్లో కూలిన ఇండ్లు
- పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డి/లింగంపేట/రామారెడ్డి/ మద్నూర్, సెప్టెంబర్ 2 : జిల్లాలో రెండుమూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. కొన్ని మండలాల్లో రోడ్లు కోతకు గురవడం, వంతెనల పై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పాత ఇండ్లు కూలిపోయాయి. ఎల్లారెడ్డి మండలంలోని అడ్విలింగాల, భిక్కనూరు, గండిమాసానిపేట, ఎల్లారెడ్డి పట్టణంతోపాటు పలు గ్రామాల్లో కూలిన ఇండ్లను అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వెళ్లి పరిశీలించి , బాధితులకు భరోసా ఇచ్చారు. పట్టణంలో కూలిన ఇండ్లను మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు పరిశీలించి, ఆర్డీవోకు సమాచారం అందజేశారు. కస్తూర్బా పాఠశాల ప్రాంగణంలోకి వర్షపు నీరు రావడంతో సోమవారం ఆర్డీవో ప్రభాకర్, స్థానిక అధికారులతో కలిసి వెళ్లి పరిశీలించారు. లింగంపేట మండలంలో 23 ఇండ్లు కూలిపోయాయని, వివరాలను కలెక్టర్‌కు పంపనున్నట్లు తహసీల్దార్ నరేందర్‌గౌడ్‌తెలిపారు.

కూలిన ఇంటికి తక్షణ సాయం కింద రూ.3,200

భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలిపోతే ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి రూ.3200 తక్షణ సహాయం కింద మంజూరు చేసినట్లు ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలో 25 ఇండ్లు పాక్షికంగా కూలినట్లు పేర్కొన్నారు. ఎల్లారెడ్డి మండలంలో 5, లింగంపేట మండలంలో 14, గాంధారి మండలంలో 5, నాగిరెడ్డి పేట మండలంలో ఒక ఇల్లు కూలినట్లు చెప్పారు. లింగంపేట మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి.
కోమట్‌పల్లి గ్రామంలోని కేశాయిపేట చెరువు అలుగు నుంచి వరద అధికంగా ప్రవహించడంతో అన్నారెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై కల్వర్టు కూలి పోయిం ది. దీంతో రాకపోకలు నిలిచిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. అయ్యపల్లిలోని దేవుని చెరువు కాలువకు గండి పడినట్లు రైతులు తెలిపారు. శెట్పల్లి గ్రామంలోని ఊర చెరువుకు గండి పడడంతో గ్రామస్తుల సహకారంతో తహసీల్దార్ నరేందర్, నీటి పారుదల శాఖ ఏఈ అరుణప్రభ గండి పూడ్చి వేయించారు. లింగంపేట మండలంలోని నాగారం వంతెనకు ఇరువైపుల రహదారి కోతకు గురికావడంతో కోర్పోల్, బాణాపూర్, బాయంపల్లి, బాయంపల్లి తండా, బాణాపూర్ తండాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి.
రామారెడ్డి మండల కేంద్రంలోని గంగమ్మవాగు వద్ద వరద ఉధృతి పెరగడంతో రామారెడ్డి, మద్దికుంట, రెడ్డిపేట్, అన్నారం, భీమ్‌గల్ తదితర గ్రామాలతోపాటు కామారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో దినసరి కూలీలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు తీవ్ర ఇ బ్బందులు పడుతూ సదాశివనగర్ జాతీయ రహదారి మీదుగా వెళ్తున్నారు. తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో 23 ఇండ్లు పాక్షికంగా కూలి పోయినట్లు తహసీల్దార్ రహీముద్దీన్ తెలిపారు. నందివాడ, ఎండ్రియాల్, ఎర్రపహాడ్ గ్రామాల్లో 80 మంది రైతులకు చెందిన సోయాబీన్, వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారి నర్సింహులు తెలిపారు. మద్నూర్ మండలం గోజేగావ్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, ఎస్సై విజయ్‌కొండ కలిసి వాగు ఉధృతిని పరిశీలించారు.

పలుచోట్ల పునరావాస కేంద్రాల ఏర్పాటు

బాన్సువాడ రూరల్/బీబీపేట్/నస్రుల్లాబాద్/రాజంపేట్/భిక్కనూరు, సెప్టెంబర్ 2 : బాన్సువాడ మండలం హన్మాజీపేట్, అవాజ్‌పల్లి తండా గ్రామాల్లో ఇండ్లు కూలడంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. బాధితులకు గ్రామ పంచాయతీ భవనంలో తాత్కాలిక పునరావాసన కేంద్రాలను ఏర్పాటు చేశారు. బీబీపేట పెద్ద చెరువు అలుగుపారుతున్నది. జనగామ- మాందాపూర్‌లోని ఎడ్ల కట్టవాగు, తుజాల్‌పూర్ కూడవెళ్లి వాగు, మానుల వాగు జోరుగా ప్రవహిస్తున్నాయి. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బీర్కూర్‌లో సోమవారం ఒక ఇల్లు కూలింది. మనస్వి, కృతిక పడుకున్న సమయంలో గోడ కూలడంతో పెను ప్రమాదం తప్పింది. రాజంపేట్ మండలంలోని కొండాపూర్, గుండారం గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జి వద్ద మట్టి రోడ్డు కుంగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొండాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో మరమ్మతు పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన కామల్ల బీరప్ప ఇల్లు కూలిపోయింది. భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి, తిప్పాపూర్‌లో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రాజంపేట, ఆర్గొండ, కొండాపూర్, తలమడ్ల గ్రామాల్లో మండల వ్యవసాయాధికారిణి సునీతారాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు శిల్ప, రజిత, బాలకిషన్ పంటలను పరిశీలించారు.

రామారెడ్డి మండలంలో వేసిన తాత్కాలిక రోడ్డుపై ప్రవహిస్తున్న గంగమ్మ వాగు నీళ్లు

నస్రుల్లాబాద్‌లో కూలిన ఇల్లు

పెద్దమల్లారెడ్డిలో వర్షానికి కూలిన ఇల్లు

హన్మాజీపేట్ పునరావాస కేంద్రంలో ఇండ్లు కూలిన బాధితులు

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య

జుక్కల్‌లో ఎడ్లపొలాల అమావాస్య కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

గాంధారి/బిచ్కుంద/ సెప్టెంబర్ 2 : జిల్లాలో సోమవారం ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు ఘనంగా జరుపుకొన్నారు.గాంధారి, బిచ్కుంద, మద్నూర్ మండలాల్లోని రైతులు గ్రామ సమీపంలోని చెరువులు, వాగుల్లోకి ఎడ్లను తీసుకుపోయి శుభ్రంగా కడిగారు. అనంతరం బసవన్నలను అందంగా అలంకరించారు. వాటికి మహిళలు నుదుటికి కుంకుమ బొట్టు పెట్టి, మంగళహారతులిచ్చారు. ఉలువలు, బెబ్బర గుడాలతో పాటు బెల్లం పాకాన్ని తినిపించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి, ఆలయాల చుట్టూ తిప్పారు. వ్యవసాయేతర కుటుంబాల వారు మట్టితో చేసిన ఎడ్ల ప్రతిమలను ఇండ్లలో ప్రతిష్టించి పూజలు చేశారు. జుక్కల్ మండలకేంద్రంలో నిర్వహించిన పొలాల అమావాస్య పర్వదినంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు. బసవన్నలకు షిండే ప్రత్యేకపూజలు చేశారు. పంటలు బాగా పండి అన్నదాతలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. బజార్ హనుమాన్ మందిరం, వీర హనుమాన్ మందిరం వద్ద రైతులు తమ బసవన్నలను ఊరేగించారు.

మోడెగాంలో ఒకరి అదృశ్యం

రామారెడ్డి, సెప్టెంబర్ 2: సదాశివనగర్ మండలం మోడెగాం గ్రామానికి చెందిన ఒకరు అదృశ్యమైనట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. కుంట అశోక్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ లభిస్తే సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం

జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

గాంధారి, సెప్టెంబర్ 2: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని సర్వాపూర్, రాంపూర్‌గడ్డ, పొతంగల్ కలాన్, గౌరారం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి రాయుడు తిరుమల ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి, ప్రభుత్వా నికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. మక్కజొన్న, పత్తి, కంది , సోయాబీన్ పంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ ఉండడం ద్వారా పంటలు దెబ్బతింటాయని తెలిపారు. రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పొలాల నుంచి మురుగునీటిని తొలగించాలి

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ఉన్న పొలాల నుంచి మురుగునీటిని తొలగించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముఖీద్ రైతులకు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధిక వర్షాల నుంచి పంటల సంరక్షణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. మరికొన్నిరోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, పంట పొలాల్లో పురుగుల మందులను పిచికారీ చేయడం తాత్కాలింగా నిలిపివేయాలని సూచించారు.

రాంపూర్‌గడ్డ సమీపంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్2: మండల కేంద్రం సమీపంలో గ్యాస్ గోదాం వద్ద వర్షాల కారణంగా ఆదివారం గోడకూలి 11కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపడగా.. సోమవారం విద్యుత్ శ